క్లుప్తంగా

ఆంజనేయ స్వామికి అమావాస్య పూజలు


ఆంజనేయస్వామికి తమలపాకులతో పూజలు చేసిన భక్తులు

ఆత్మకూరు: స్థానిక పాత బస్టాండులో వెలిసిన అభయాంజనేయస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం మహిళలు 108 మందితో కలిసి స్వామివారికి ఆకు పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత, విశేష పూజల అనంతనరం 108 మంది మహిళలతో ఆకు పూజలు, కుంకుమార్చన నిర్వహించి ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి విశేష పూజలతో పాటు రాత్రి నక్షత్ర హారతులను ఇవ్వడంతో పాటు అర్ధరాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి ఐదు రకాల హారతులతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. రాత్రి భజనలతోపాటు స్వామివారి సన్నిధిలో భక్తులకు అల్పాహారం అందించారు.

కూలీల సంఖ్య పెంచాలి


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: రోజువారి ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ మేరి సిబ్బందికి సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ఆమె సిబ్బందితో సమావేశమయ్యారు. అన్ని గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. కూలీలు కొలతల ప్రకారం పనులు చేసేలా పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ హరికృష్ణ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు: మండల పరిధిలోని వేల్పనూరు గ్రామంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తన స్వగహంలో బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొంది.. ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి 50 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. 50 మంది బాధితులకు మంజూరైన రూ.45 లక్షల చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరికి ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అన్నారపు శేషిరెడ్డి, కేసీ కెనాల్ కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కొత్తపల్లి: ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కురువ ఈరన్నను దారుణంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కొత్తపల్లి మండల ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపీడీఓ మేరికి వినతిపత్రం అందించారు. బాధిత ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేసియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు నక్కా సంపత్, సుధాకర్, స్వాములు, విజయలక్ష్మి, రామలక్ష్మి, రత్నాకర్, కళ్యాణ్, ఎల్లనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిపై దాడి తగదు

ఆత్మకూరు: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, నందికొట్కూరు పట్టణానికి చెందిన కురుమూర్తిపై దాడి చేసి, గాయపరిచన వ్యక్తులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్. రఘురాముడు యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు డబ్బి వెంకటస్వామిగౌడ్, గౌరవాధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బాలస్వామియాదవ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న కురుమూర్తిపై వ్యక్తిగత కారణాలతో దాడి చేయడం హేయమైన చర్య అని, కూర్చొని మాట్లాడుకోవడం లేదా చట్టం ద్వారా పరిష్కరించుకోవాలే తప్పా దాడికి పాల్పడడం దుర్మార్గపు చర్య అని చెప్పారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని, లేకపోతే పోరాటం చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరన్న, డాక్టర్ వెంకటేశ్వర్లు, గోగుల తిమ్మయ్య, పెద్దన్న, లక్ష్మణ్‌సింగ్, డీలర్ రమణ, పెద్దనాగన్న, పవన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

● ఏడీఏ విజయశేఖర్


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

నందికొట్కూరు: వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ విజయశేఖర్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని మల్యాల గ్రామ పొలిమేరలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని అల్లూరు, శాతనకోట, మల్యాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంటలకు తెగుళ్లు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి రైతు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. పంట మార్పిడి, అధిక ఉత్పత్తి వంగడాల సాగుతో లాభాలను ఆర్జించవచ్చన్నారు.

– వెలుగోడు: మండలంలోని బోయరేవుల గ్రామంలో పప్పు శనగ పంట కొత్త ప్రయోగాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో సాగుచేసిన పప్పుశనగ ఎకరాకు ఏడు క్వింటాళ్ల దిగుబడి వచ్చిందన్నారు. రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకంతో అధిక దిగుబడి వచ్చిందన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పాములపాడు: పైర్ల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తుమ్మలూరు, జూటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మినుము పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ పసుపు రంగు జిగురు అట్టలను ఎకరా పొలంలో 20–25 చొప్పున ఏర్పాటు చేసుకుంటే దోమ ఉధృతిని తగ్గించవచ్చన్నారు. తెల్లదోమ నివారణకు లీటరు నీటికి థయోమిథాక్సాన్ 0.2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రబీలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ రామాంజనేయులు, వీహెచ్ఏ స్వాతి పాల్గొన్నారు.

పేదలకు అండగా జీవిత బీమా సంస్థ


మాట్లాడుతున్న ఎల్ఐసీ కడప డివిజన్ సీనియర్ మేనేజర్ జీకేఆర్‌వీ రవికుమార్

నందికొట్కూరు: పేదలకు జీవిత బీమా సంస్థ ఎంతో అండగా ఉంటుందని కడప డివిజనల్ సీనియర్ మేనేజర్ జీకేఆర్‌వీ రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక సత్యనారాయణ కళ్యాణ మండపంలో లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఆత్మకూరు ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న జీవిత బీమా సంస్థ 6 లక్షల పాలసీలు చేసి రూ.వెయ్యి కోట్ల ప్రీమియం సాధించిందన్నారు. ఆత్మకూరు ఎల్ఐసీ బ్రాంచ్ కడప డివిజన్‌లో రెండో స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ మార్కెటింగ్ మేనేజర్ శ్యాం సుందరరావు, ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పాండురంగరావు, ఏబీఎం విశ్వనాథ్, ఏజెంట్లు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


ధర్నా చేస్తున్న నాయకులు, ప్రజలు

నందికొట్కూరు: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కన్వీనర్ లాజరస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట బీఆర్ఆర్ నగర్‌లో ఖాళీగా ఉన్న స్థలాలను పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి స్థలం మంజూరు చేసి, నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రాజు, కాంతమ్మ, మల్లయ్య, గౌసియాబీ, సావిత్రమ్మ, సరోజమ్మ, సుబ్బమ్మ, లక్ష్మీదేవమ్మ, విశ్రాంతమ్మ, ఖాసీం, సూర్యుడు పాల్గొన్నారు.

అనుమతుల్లేని వెంచర్లు వేస్తే చర్యలు


అక్రమ వెంచర్ల వివరాలు వీఆర్వోను అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: వ్యవసాయ భూముల్లో అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఉమారాణి హెచ్చరించారు. బుధవారం మండలంలోని నందికుంట గ్రామ శివారులోని ఆంజనేయస్వామి ఆలయం వెనుక వ్యవసాయ పొలంలో అనుమతులు లేకుండా వేస్తున్న వెంచర్ పనులను పరిశీలించి వెంటనే ఆపేయాలని వీఆర్వోను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వ్యవసాయ భూమిని వ్యవసాయేతర పనులకు ఉపయోగించరాదన్నారు. ఒకవేళ అలా ఉపయోగించుకోవాలనుకుంటే రెవెన్యూ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. చట్ట విరుద్ధంగా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాట్లు వేస్తున్న పలువురిని అనుమతి పత్రాలు తీసుకురావాలని ఆదేశించారు. మరో ప్రదేశంలో ప్లాట్లు వేశారని తమ దృష్టికి వచ్చిందని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట వీఆర్ఓ కృష్ణారెడ్డి, సర్వేయర్ నాగమణి ఉన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళా వేదికపై ధర్మవరానికి చెందిన లలిత నృత్య కళానికేతన్ వారి సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. వినాయకస్తు తి, మహాగణపతిం, లింగాష్టకం, శివతాండవం, నటరాజ నర్తనం, ఓం హర శంకరా హర్షశ్రీ, డి.రామలాలిత్య, లీలామాధవి, వేద ప్రజ్ఞ, ప్రణీత, తరుణి ప్రణ తి, ధాత్రిక తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఆత్మకూరు/నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీశైలం, నందికొట్కూర్ అసెంబ్లీ నియోజకవర్గాల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం సాయంత్రం ఓ ప్రకటన జారీ చేసింది.

శ్రీశైలం	వింగ్	నందికొట్కూర్
ఎన్.దిలీప్‌కుమార్‌రెడ్డి	యూత్ వింగ్	షేక్ హిదాయతుల్లా(లడ్డు)
జిల్లెల లక్ష్మీదేవి	మహిళా విభాగం	టి.ఉషారాణి
పి.రామసుబ్బారెడ్డి	రైతు విభాగం	జి.మల్లేశ్వరరెడ్డి
వరకవి నాగరాజు	బీసీ సెల్	బీ.విజయకుమార్
వేల్పుల జయపాల్	ఎస్సీ సెల్	దాసరి పుల్లయ్య
జి.శివ శంకర్‌నాయక్	ఎస్టీ సెల్	బుక్క రాములునాయక్
మోమిన్ ముస్తఫా	మైనార్టీ సెల్	అక్తర్‌బాషా
బుడాల కానయ్య	క్రిస్టియన్ మైనార్టీ సెల్	సత్రి రవి జయప్రకాష్
దర్గా రియాజ్‌బాషా	స్టూడెంట్ వింగ్	షేక్ అబ్దులా
కె.రామ్మోహన్‌రెడ్డి	పంచాయతీరాజ్ వింగ్	పేరుమాళ్ల శేషన్న
పొన్న్యం పార్వతి	మున్సిపల్ వింగ్	అల్లూరి క్రిష్ణ
బండి శ్రీనివాసులు	ఆర్‌టీఐ వింగ్	బోయ రవికుమార్
ఎ.బషీర్ హుసేన్	వలంటీర్స్ వింగ్	సయ్యద్ జంపీద్‌బాషా
సైద్ బాషాఖాద్రి	గ్రీవెన్స్ సెల్	అనత జనార్దన్‌గౌడ్
బిళ్లారి సత్యనారాయణ	వాణిజ్య విభాగం	బలుప భార్గవతేజ
సనా నారాయణ	వీవర్స్ వింగ్	పొన్న్యం నాగరాజు
షేక్ మలిక్షావలి	వైఎస్సార్‌టీయూసీ	జాన్ రాబట్
సైద్ నజియా సుల్తానా	అంగన్‌వాడీ వింగ్	కోకటం శోభాలత
పి.సుబ్రహ్మణ్యం	లీగల్ సెల్	పుల్యాల నాగశేఖరరెడ్డి
ఎ.నాగపుల్లయ్య	కల్చరల్ వింగ్	చెంచు రామమోహన్
షేక్ అబ్దుల్ వహీద్	సోషల్ మీడియా వింగ్	అహన్న మధు
షేక్ అన్వర్‌సాదత్	ఐటీ వింగ్	ఉండవల్లి సోమశేఖర్‌రెడ్డి
దాసరి పుల్లయ్య	దివ్యాంగుల విభాగం	జక్కుల నరేష్
షేక్ నూర్‌బాషా	డాక్టర్స్ వింగ్	మల్లిరెడ్డి శేఖర్
అట్లా వెంకటక్రిష్ణారెడ్డి	పబ్లిసిటీ వింగ్	షేక్ రహంతుల్లా
కె.వెంకట శ్రీనివాసులు	బూత్ కమిటీస్	పెరుగు నాగలక్ష్మిరెడ్డి
ఈసీవీ సుబ్బారెడ్డి	ఇంటెలెక్చువల్ ఫోరమ్	పొరెడ్డి నారాయణరెడ్డి

ఆందోళన విరమణ

పాములపాడు: శ్మశాన వాటిక స్థలం కోసం తుమ్మలూరు, క్రిష్ణారావుపేట గ్రామాల దూదేకుల, ముస్లింలు చేపట్టిన ఆందోళనను బుధవారం విరమించారు. జూపాడుబంగ్లా మండలం బన్నూరు గ్రామ పొలిమేరలో ఉన్న శ్మశాన వాటిక స్థలం హైవేలో కోల్పోతుండటంతో ఆయా గ్రామస్తులు రెండు రోజులుగా ఆందోళనకు దిగారు. తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ శిబిరం వద్దకు చేరుకుని పరిశీలించారు. హైవే అధికారులతో మాట్లాడి నష్టపరిహారంతో పాటు ఒప్పందం ప్రకారం 10 సెంట్ల స్థలంలో మాత్రమే హైవేకు తీసుకోవాలని మిగతా స్థలంలోకి వెళ్లొద్దని సూచించడంతో సమస్య సద్దుమణిగింది. దీంతో ఆయా గ్రామాల దూదేకుల, ముస్లింలు ఆందోళన విరమించారు.

ప్రశాంతంగా జీవించాలి

మహానంది: గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సీతారామపురం గ్రామంలో బుధవారం రాత్రి ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అల్లర్లు, గొడవల జోలికి వెళ్లొందని సూచించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

పాములపాడు: స్థానిక శ్రీశారదా విద్యానికేతన్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు చట్టాలపై ఎస్ఐ సురేష్‌బాబు అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. సెల్‌ఫోన్లకు బానిస కావద్దన్నారు. సెల్ ఫోన్‌లో లింక్‌లను ఓపెన్ చేసి సైబర్‌క్రైం బారిన పడొద్దని, ఇంట్లోని తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని సూచించారు. బాగా చదువుకొని భవిష్యత్తులో స్థిరపడాలన్నారు. ఎక్కడైనా ఎవరి నుంచైనా హాని ఉందని భావిస్తే 100, 1098, 1930 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల వాహనాల కోసం పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుక్కాపురం వైపు ఉన్న టోల్‌గేట్ వద్ద 12 ఎకరాల పొలంలో బుధవారం జేసీబీతో పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తుల వాహనాలకు నంది విగ్రహం ఎదురుగా ఉన్న పొలాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తామన్నారు. గుంటూరు, విజయవాడ నుంచి గిద్దలూరు మీదుగా వచ్చే భక్తుల కోసం గాజులపల్లె టోల్‌గేట్ వైపు ఉన్న పాత వివేకానంద పాఠశాల ప్రాంగణం వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో జంగిల్ క్లియరెన్స్ పనులు సైతం మొదలు పెట్టామన్నారు.

విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతో ను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

యూరియా నిల్వల తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి: మండల కేంద్రంలోని మనగ్రోమోర్ సెంటర్‌లో యూరియా నిల్వలు, అమ్మకాలపై ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ బుధవారం మండల వ్యవసాయాధికారి మహేష్‌తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా రిజిస్టర్లు, నిల్వలు, అమ్మకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాల పోలిమేరల్లోని పంటపొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో సాగు చేసిన పంటలు నమోదు చేసుకోవాలని సూచించారు. పంటలలో తీసుకోవాల్సిన సస్య రక్షణ పద్ధతులు, పురుగు, తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు.

కూరగాయల సరఫరాకు ముందుకొచ్చిన దాత


దాతను సన్మానించిన వేదపండితులు, ఆలయ అధికారులు

మహానంది: మహానంది నిత్యాన్న ప్రసాద పథకానికి కూరగాయలను ఉచితంగా అందించేందుకు హైదరాబాద్‌కు చెందిన మేకల జంగారెడ్డి ముందుకొచ్చినట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దాత జంగారెడ్డి బుధవారం మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈఓ మాట్లాడుతూ ఇప్పటికే రెండు నెలల నుంచి జంగారెడ్డి కూరగాయలు ఉచితంగా పంపుతున్నారన్నారు. ఇకపై శాశ్వతంగా కూరగాయలను పంపేందుకు అంగీకరించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ నుంచి కూరగాయలను మహానంది చేర్చేందుకు హైదరాబాద్‌కు చెందిన వారణాసి రామ్మోహన్ రావు, నంద్యాలకు చెందిన బాలగంగాధర బస్సు సర్వీస్ వారు సహకరిస్తున్నట్లు వివరించారు. అనంతరం దాతకు స్వామి అమ్మవారి చిత్రపటం అందించి సన్మానించారు. కార్యక్రమంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం శ్రీనివాసులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలకు స్థలం కేటాయింపు


లక్ష్మాపురంలో స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ సుమిత్రమ్మ

పగిద్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే సంపద తయారీ కేంద్రానికి తహసీల్దార్ శివరాముడు స్థలం కేటాయించారని ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. బుధవారం గ్రామానికి చేరుకున్న తహసీల్దార్ 6 సెంట్ల ప్రభుత్వ భూమిని గుర్తించి సర్వేయర్‌తో కొలతలు వేయించి అప్పగించారని, త్వరలోనే షెడ్ నిర్మాణ పనులను సర్పంచ్ ఆధ్వర్యంలో పూర్తి చేయిస్తామని ఎంపీడీఓ వెల్లడించారు. పడమర ప్రాతకోటలో నిలిచిపోయిన షెడ్ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేయాలని సర్పంచ్ శేషమ్మకు సూచించామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఏపీఓ మద్దిలేటి పాల్గొన్నారు.

పశు వ్యాధులను నిర్లక్ష్యం చేయెుద్దు


పశు పోషకులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ నిర్మలమ్మ, వైద్యురాలు పావని

జూపాడుబంగ్లా: పశు వ్యాధులను నిర్లక్ష్యం చేయెుద్దని పశువుల పశు వైద్యాధికారిణి పావని యజమానులకు సూచించారు. బుధవారం పోతులపాడు గ్రామంలో సర్పంచ్ పల్లె నిర్మలమ్మ అధ్యక్షతన పశువైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ పావని, సర్పంచ్ నిర్మలమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం పశుపోషకులకు ఇస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని పశువులు, జీవాలు, కోళ్ల పెంపకం చేపట్టి రాణించాలన్నారు. అనంతరం 40 పశువులకు, 10 దూడలకు, 250 జీవాలకు నట్టల నివారణ మందును తాగించారు. 10 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ శాంతి, వైద్యసిబ్బంది వెంకటేశ్‌యాదవ్, హేమకుమార్, నిరీష, గోపాలమిత్ర సుంకన్న, శివానందరెడ్డి పాల్గొన్నారు.

● బండిఆత్మకూరు: మండల కేంద్రంతోపాటు సింగవరం గ్రామంలో బుధవారం నంద్యాల డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో, మండల పశు వైద్యాధికారులు డాక్టర్ అనూష, డాక్టర్ గౌసియా ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలలో పశువులకు చూడీ, గొడ్డు మోతు పశువులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

● **పశువులను సంరక్షించుకోవాలి**

పాములపాడు: రైతులు పశువులను సంరక్షించుకోవాలని పశు వైద్యాధికారి భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని బానకచెర్ల, గుండాలనట్లు గ్రామాల్లో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎద్దులు 20, గేదెలు 15, దూడలు 40, గొర్రెలు 450, కోళ్లు 240 లకు నట్టల నివారణ మందులు తాపించారు. 4 గేదెలకు చూడీ పరీక్షలు చేశారు. పశువుల పోషణ, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

● ఐటీడీఏ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రాజెక్ట్ అధికారి కె.వెంకటశివప్రసాద్


కుట్టుమిషన్ శిక్షణను పరిశీలిస్తున్న పీఓ శివప్రసాద్

శ్రీశైలంప్రాజెక్ట్: ఉచితంగా ఇస్తున్న కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రాజెక్ట్ అధికారి కె.వెంకటశివప్రసాద్ సూచించారు. సున్నిపెంటలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని చెంచుగిరిజన మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ సంకల్ప్ పథకం కింద 30 మంది గిరిజన మహిళలకు 30 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. భోజన, వసతి సౌకర్యాలను కూడా ట్రైనింగ్ సెంటర్‌లో ఉచితంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టుమిషన్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం కుట్టుకు అవసరమైన కిట్‌లను మహిళలకు అందజేశారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు: మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను బుధవారం ఎక్సైజ్ ఎస్ఐ, పోలీసులు ధ్వంసం చేశారు. నాటు సారా తయారు చేస్తున్నారనే సమాచారం రావడం సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేశామని ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ శంకర్ నాయక్ పోలీసులు శివన్న, సుధీర్‌కుమార్, మధుప్రసాద్, రమిజాబీ పాల్గొన్నారు.

కృష్ణానది యాజమాన్య బోర్డ్ కర్నూలులోనే ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాయలసీమ సాగునీటి సమితి సభ్యులు

వెలుగోడు: కృష్ణానది యాజమాన్య బోర్డ్ కార్యాలయం కర్నూలులోని ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాసగౌడును వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు ముఖమల్ల భాస్కర్ రెడ్డి, నసురుల్లా ఖాన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం 2014 ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లో కృష్ణానది నీటి నిర్వహణ చేయడానికి కృష్ణా జిల్లాల వినియోగంపై వివాదాలను పరిష్కరించడానికి కృష్ణానది యాజమాన్య బోర్డును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ బోర్డు ప్రధాన కేంద్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలన్న నిబంధన విభజన చట్టంలో ఉందన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో శ్రీశైలం రిజర్వాయర్ కృష్ణానది నీటి యాజమాన్యానికి, నిర్వహణకు వ్యూహాత్మక ప్రదేశంలో ఉందన్నారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులే కాకుండా ప్రకాశం, నెల్లూరు, మహబూబ్ నగర్ జిల్లాలకు కృష్ణా జలాల పంపిణీకి శ్రీశైలం రిజర్వాయర్ అత్యంత కీలకమన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ ఉన్న కర్నూలు జిల్లాలో కృష్ణా నది యాజమాన్య బోర్డ్ ఏర్పాటుకు ఇన్ని అనుకూలతలు ఉన్నప్పటికీ వేరే ప్రాంతానికి తరలించాలనే ఆలోచన పునః పరిశీలించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

జాయింట్ కలెక్టర్‌ను కలిసి మాట్లాడుకోండి

● 3 రోజులు పనులు జరుగకుండా చూస్తా
● రోడ్డు పనులు ప్రారంభమైనప్పుడు ఏం చేస్తున్నారు?
● ఇప్పుడొచ్చి పనులు అడ్డుకోవడమేంటి?
● డీఎస్పీ రామాంజినాయక్


ప్రజలతో మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్

పాములపాడు: మండలంలోని పాములపాడు–చెలిమిల్ల గ్రామాల మధ్య ఎన్‌హెచ్340సీ నిర్మాణంలో భాగంగా చేపట్టిన అండర్‌పాస్ వంతెన ఎత్తు పెంచాలని కోరుతూ దిగువనున్న గ్రామాల ప్రజలు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. కాగా ఇప్పటికే జిల్లా కలెక్టర్, జేసీ, ఆర్డీఓ, ఎన్‌హెచ్ పీడీలకు వినతి పత్రాలు ఇచ్చారు. బుధవారం ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ చెలిమిల్ల, లింగాల గ్రామాల సర్పంచులు, ప్రజలను అండర్‌పాస్ వంతెన వద్దకు పిలిపించారు. సమస్యను ఆయా గ్రామాల ప్రజలు డీఎస్పీకి వివరించారు. అయితే డీఎస్పీ ప్రజలతో మాట్లాడిన తీరుపై అందరూ విస్మయానికి గురయ్యారు. ›3 రోజులు పనులు ఆపుతాం. ఈ లోపు జాయింట్ కలెక్టర్‌ను కలిసి మాట్లాడుకోండి. 2018లో మార్కింగ్ వేశారు. అప్పుడే మీరు మాట్లాడుకోవాల్సింది. ఇప్పుడైనా అందరూ కలిసి అధికారుల వద్దకెళ్లి కూర్చొని మాట్లాడుకోండి. గొడవ పడాల్సిన పనిలేదు. ఎవరికిష్టమైనప్పుడు వారొస్తే ఎట్లా? చట్టాన్ని చేతిలోకి తీసుకుంటామంటే కుదరదు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. నేషనల్ హైవే ప్రాజెక్టు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చేస్తున్నారు. మీ కోసమే కదా మా కోసం కాదుకదా అని డీఎస్పీ ప్రజలనే ప్రశ్నించారు. కాగా తాము అభివృద్ధికి ఆటంకం కాదని, రహదారిలో 23 గ్రామాల ప్రజల రాకపోకలు సాగిస్తున్నామని, ధాన్యం, పశుగ్రాసం తీసుకెళ్లేందుకు సైతం వీలు కావడం లేదని ప్రజలు డీఎస్పీకి వివరించారు. డిజైన్లు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఇక్కడి పరిస్థితులకనుగుణంగా చేపడితే సమస్యలు ఉత్పన్నం కావుకదా అని ప్రజలు వివరిస్తుండగా పట్టించుకోకుండా అక్కడి నుంచి డీఎస్పీ వెళ్లిపోయారు. అనంతరం సమస్య పరిష్కారానికి పోరుబాటే మార్గమని, శిబిరం ఏర్పాటు చేసి ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధం కావాలని ప్రజలు చర్చించుకున్నారు. చెలిమిల్ల, లింగాల సర్పంచులు కోట్ల చంద్రారెడ్డి, మల్లీశ్వర రెడ్డి, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, రైతులు గోపాల్, లచ్చలగౌడు, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.